క్లుప్తంగా

రేపు నూతన భవనం ప్రారంభం

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండలం సంతగేటులోని నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు సురేఖ, అనిల్‌కుమార్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు సత్యకుమార్ యాదవ్ హాజరుకానున్నట్లు వివరించారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బంగారుపాళెం: మండల పరిధిలోని ఆండారెడ్డిపల్లె వద్ద జాతీయ రహదారిపై గుంతలో పడి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు గాయాలపాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, రహదారిపై మురుగు ప్రవహించడంతో గుంతమయంగా మారింది. ఈ గుంతల్లో ద్విచక్ర వాహనదారులు పడి గాయపడుతున్నారు. ఇప్పటికే పలువురు గాయపడ్డారు. అదే క్రమంలో సాయంత్రం ఇద్దరు వ్యక్తులు బైక్ మీద ప్రయాణిస్తూ ఈ గుంతలో పడి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గోడ కూల్చారని ఫిర్యాదు



గడ్డివాము తొలగించి చదును చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రామకుప్పం మండలంలోని పచ్చారమాకులపల్లిలో గోడ కూల్చారని రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలు శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నం:15/3లో తనకు చెందిన భూమిలో గోడ, గడ్డివామును అదే గ్రామానికి చెందిన క్రిష్ణప్ప దౌర్జన్యంగా కూల్చినట్లు తెలిపారు. క్రిష్ణప్ప సహా మరో ఐదుగురు తమపై దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన



హోమం చేస్తున్న వేదపండితులు

సదుం: స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో నూతన నాగరాళ్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ఎల్లారెడ్డి, నాగభూషణంరెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కాలభైరవ అష్టమి యజ్ఞం



యజ్ఞపూజ చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయంలో సోమవారం కాలభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ మహా కాలభైరవ అష్టమి యజ్ఞ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉదయం అగస్తీశ్వరస్వామికి మహాభిషేకం, విఘ్నేశ్వరపూజ, గోపూజ, అశ్వపూజ, శునక పూజ, 108 శంఖు, 81 కలశ స్థాపన మొదటిపూజ, దీపారాధన సాయంత్రం, కాళభైరవ స్వామికి 64 ద్రవ్యాలతో అభిషేకం, యజ్ఞ పూజలను వేద మంత్రోచ్చరణలతో జరిపించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వెంకటేష్, అర్చకులు శివ, ఈవో తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమతెర తప్పక వాడాలి



బాలికల బీసీ హస్టల్‌లో కిటికీల మెస్‌ను పరిశీలిస్తున్న మోహన్‌బాబు

పాలసముద్రం: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు రాత్రుల్లో దోమతెర తప్పకుండా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు తెలిపారు. సోమవారం ప్రభుత్వ బీసీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో దోమల వల్ల అంటువ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కిటికీలకు మెస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి. మహిళా వైద్యులకు ఆస్పత్రుల్లో రక్షణ ఉండాలి. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వార్డుల్లో పని చేసే పీజీ, జూనియర్ వైద్యులు తీవ్రమైన ఒత్తిడితో విధులు నిర్వర్తింటారు. మహిళా వైద్యుల రక్షణకు సుప్రీంకోర్టు సూచనలను అమలు చేస్తే ప్రయోజనం ఉంటుంది. భద్రతతో పాటు చట్టాలను పటిష్టం చేయాలి. మహిళా డాక్టర్లలో ఆత్మ విశ్వాసం పెరగాలంటే సమాజం నుంచి కూడా మద్దతు అవసరం.

–నిషాంత్, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



పటిష్ట చట్టాలు రూపొందించాలి



రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులతోపాటు నర్సులు కూడా తీవ్రంగా శ్రమిస్తారు. నర్సులు ఎప్పుడు రోగి, బంధువులకు సహాయకారిగా ఉంటారు. కానీ ఒక్కో సందర్భంలో రోగులు, వారి బంధువుల నుంచి ఇబ్బందులు పడుతుంటాం. అందుకే నర్సులకు అవసరమైన భద్రత ఉండాలి. రాత్రి సమయంలో ఎక్కువగా వార్డుల్లో ఉండేది నర్సులే. వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తే.. భయం లేకుండా పనిచేస్తారు. మా భద్రతకు ఇంకా పటిష్టమైన చట్టాలను రూపొందించాలి.

–మమత, వైద్యుల సంఘం నాయకురాలు, చిత్తూరు

బలహీన క్షణం.. బలవన్మరణం!

- చిన్న చిన్న సమస్యలు.. క్షణికావేశాలు
- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో పదుల సంఖ్యలో ఆత్మహత్యలు
- కుటుంబసభ్యులకు తప్పని శోకం



ఐరాల మండలం చిగరపల్లెకు చెందిన విద్య(22) గత నెల ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇది గమనించిన తల్లిదండ్రులు విద్యను చికిత్స నిమిత్తం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు యువతి మరణించినట్లు వెల్లడించారు. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ప్రేరేపిత హత్యగా తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చిత్తూరు మండలం ఆనగల్లుకు చెందిన అనిత (25) ఈ నెల 21న ఏడాది బిడ్డను కాళ్ల కింద పెట్టుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఉరివేసుకున్న ఆమెను కుటుంబీకులు చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇంతలో ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మృతురాలు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కుటుంబ కలహాలతో చనిపోయినట్లు కేసు నమోదు చేశారు. ఇలాంటి కేసులు చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ప్రతి నెలా పదుల సంఖ్యలో వెలుగు చూస్తుంటాయి.

కాణిపాకం: జీవిత ప్రయాణం ముగించే మరణం సహజంగా ఉంటేనే ఆ జీవితానికి సార్థకత, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేక... చిన్న చిన్న సమస్యలకు కుంగిపోయి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎన్నో బంధాలను చిదిమేస్తున్నాయి. అయిన వారిని, కన్నవారిని పుట్టెడు దుఃఖంలోకి నెట్టేస్తున్నాయి. సమస్య ఏదైనా ఓర్పుగా పరిష్కారం వైపు అడుగులు వేయాలే తప్ప భయపడి బలవన్మరణానికి పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గ్రహించాలి. అనుబంధాలు, ఆత్మీయతలను ఒక్కసారి గుర్తుచేసుకుని ముందుకు సాగిపోతే ఎలాంటి సమస్యలైనా జయించవచ్చు. నిండు నూరేళ్ల సంతోషంగా గడిపేయవచ్చు.

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో గత ఆరు నెలల కాలంలో 25 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే ఆత్మహత్యలు చేసుకుని లెక్కల్లోకి రానివి 30 వరకు ఉన్నట్లు సమాచారం. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అధికశాతం మంది 15 నుంచి 35 ఏళ్లలోపు వారే ఉంటున్నట్లు తెలుస్తోంది. 50 ఏళ్ల పైబడిన వారిలోనూ ఈ ధోరణి అధికంగా ఉంటోందని మానసిక నిపుణులు చెబుతున్నారు. సమస్యలకు గురైనప్పుడు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతోనే అనర్థాలు జరుగుతున్నాయి.

ఇలాంటి సమస్యలతోనే...

కుటుంబ సమస్యలనో... ఆర్థిక ఇబ్బందులనో... అనారోగ్యమనో... పరీక్షల్లో తప్పామనో... ప్రేమ విఫలమైందనో ఇలా రకరకాల కారణాలతో అతిగా ఆలోచించి, బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. జీవితంలో ముందుకు వెళ్లే దారి తెలియక.. తోడుగా నిలబడే వారు లేక ఎంతో విలువైన జీవితానికి విషాదకర ముగింపు పలుకుతున్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉందన్న విషయాన్ని మరిచిపోతున్నారు ఒత్తిడి కూపంలో నుంచి బయటపడలేక అర్ధంతరంగా తనువులు చాలిస్తున్నారు. మానసికంగా కుమిలిపోతున్న వారిని సకాలంలో గుర్తించకపోవడం, గుర్తించినా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, ప్రధానంగా విద్యార్థులు, యువతపై తమ అభిప్రాయాలను తల్లిదండ్రులు బలవంతంగా రుద్దడం కూడా ఆత్మహత్యలకు కారణమవుతోందని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు యువత పరిపక్వం చెందని వయసులో తప్పుడు నిర్ణయాలతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

చట్టం ఇలా...

ఆత్మహత్యకు పాల్పడడం, యత్నించడం, ఆందుకు ప్రోత్సహించడం చట్టప్రకారం నేరం. ఆత్మహత్యకు ప్రయత్నించిన వారిపై భారత న్యాయి సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ 226 కింద, ఆత్మహత్యకు ప్రోత్సహించే వారిపై సెక్షన్ 108 కింద కేసు నమోదు చేస్తారు.

మానసిక లక్షణాలు...



ఆత్మహత్యకు పాల్పడేవారిని ముందే గుర్తించవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వారు కొన్ని అసాధారణ లక్షణాలను కలిగి ఉంటారు.

- ఒంటరితనాన్ని కోరుకుంటారు. అతిగా మద్యం తాగుతారు.
- ప్రతీకారం తీర్చుకోవడంపైనే ఎక్కువగా మాట్లాడుతుంటారు.
- తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవడం.
- అతిగా నిద్రపోవడం.
- రాత్రిపూట నిద్రపోకుండా ఎక్కువగా ఆలోచించడం.
- అసలు దేనికీ స్పందించకపోవడం, చనిపోతున్నట్లు ముందుగానే పరోక్షంగా సంకేతాలు ఇవ్వడం లాంటివి చేస్తుంటారు.

ఇలా చేయాలి...

ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచరాదు. వీలైనంతవరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచి కుటుంబ సభ్యులంతా వారిలో ధైర్యం నింపాలి. వీలైనంత వరకు ఆత్మహత్య భావన ఉన్నవారికి ఆత్మహత్యకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకుండా చూడాలి.

- ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింక్ పుస్తకాలు, బిహేవియర్ థెరపీ, కౌన్సెలింగ్ ప్రక్రియలు శక్తివంతంగా ఉపయోగపడుతాయి.
- వీలైతే మానసిక వైద్యనిపుణులచే కౌన్సెలింగ్ ఇప్పించాలి

అతిగా ఆలోచించొద్దు



ఎవరికైనా సమస్య వస్తే పెద్దలు ఓదార్చి క్షణాల్లో ఆ సమస్యను పరిష్కరించేవారు. మేమున్నామన్న ధైర్యాన్ని భరోసాను ఇచ్చేవారు. కాలంతో పాటు మానవ సంబంధాలూ మారుతున్నాయి. పరుగుల ప్రపంచంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, మారుతున్న ఆలోచనా విధాలకే ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సమస్యలు తలెత్తిన సమయంలో బాధలు మరొకరితో ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఎవరికీ చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోతున్నారు.

–జయప్రియ, మానసిక వైద్యులు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

ప్రశాంతంగా బతకడం నేర్చుకోవాలి



మానవ జీవితం అంటే.. ఒడిదొడుకులు ఉంటాయి. కష్ట సుఖాలను సమపాలలో తీసుకోవాలి. దేనికీ బెదరకూడదు. కుంగిపోకూడదు. సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా మహిళలు ఇంట్లో సమస్యలను తలకెక్కించుకోకూడదు. తేలిగ్గా తీసుకుని బతకడం నేర్చుకోవాలి. భర్త తప్పు చేస్తే పెద్దలకు చెప్పడం లేదా...పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ప్రేమించి మోసం చేస్తే.. వాటిని ఏరకంగా ఎదుర్కోవాలో తెలుసుకోవాలి. క్షణికావేశంలో నిర్ణయాలు తగదు. ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదు. ఎలాంటి సమస్య వచ్చినా ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది. ధైర్యంగా ముందుకు సాగాలి. . ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం ఆనందంగా ఉంటుంది.

–వెంకటసుబ్బమ్మ, బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐ

అక్రమార్కులపై పోలీసుల ఉక్కుపాదం

- ఎస్పీ ఆదేశాలతో పంజా విసురుతున్న స్పెషల్ బ్రాంచ్
- వారంలో నాలుగు ముఖ్యమైన దాడులు
- పలు అక్రమాలపై మళ్లీ డేగకన్ను

పలమనేరు: జిల్లాలో చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్న అక్రమార్కులపై స్పెషల్ బ్రాంచి అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎస్పీ ఆదేశాలతో స్థానిక అక్రమాలపై నిఘా విభాగం దాడులు చేస్తోంది. దీంతో పాటు మరిన్ని అక్రమాలపై వారు ఇప్పటికే కీలక సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. జిల్లాలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు సంబంధించిన బడా స్మగ్లర్ కిరణ్‌కుమార్ అక్రమాలపై వీరు ప్రత్యేక నిఘా పెట్టినట్టు సమాచారం. ఈ మధ్య వారం రోజుల్లోనే పలమనేరు సబ్‌డివిజన్‌లో రూ.3.5లక్షల విలువచేసే కర్ణాటక మద్యాన్ని పట్టణంలో పట్టుకున్నారు. ఇందులో కీలక నిందితుడైన పుంగనూరు రాజేష్‌పై కేసు నమోదు చేశారు. రెండ్రోజుల క్రితం పట్టణ సమీపాల్లోని అక్రమ టపాకాయల నిల్వ కేంద్రాలపై దాడులు చేసి సుమారు పది లక్షలు విలువచేసే టపాకాయలను సీజ్ చేశారు. తాజాగా ఆదివారం ఉమ్మడి జిల్లాలో రేషన్ స్మగ్లింగ్ డాన్ అరగొండ కిరణ్‌కుమార్‌కు చెందిన బియ్యం లారీని పలమనేరులో పట్టుకున్నారు. ఆపై తవణంపల్లె మండలంలోని కిరణ్‌కుమార్ అక్రమ గోడౌన్‌పై ఎస్పీ ఆదేశాలతో దాడులు చేపట్టి అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం, స్మగ్లింగ్‌కు చేసే బొలేరో వాహనాలను సీజ్ చేశారు. జిల్లాలో సాగుతున్న అక్రమాలపై ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ బ్రాంచి కత్తికి పదును పెట్టి మరిన్ని అక్రమాలను రట్టు చేయడం ఖచ్చితంగా కనిపిస్తోంది. దీంతో పోలీస్‌శాఖలోనూ అక్రమాలను అరికట్టాలనే ప్రయత్నాలు మొదలైనట్టు తెలుస్తోంది.



పోలీసులకు పట్టుబడిన కర్ణాటక మద్యం, నిందితుడు (ఫైల్)

పుంగనూరులో కుక్కల బెడద

పుంగనూరు: పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రం కావడంతో ప్రజలు హడలిపోతున్నారు. పట్టణంలోని రహ్మత్‌నగర్, ఉబేదుల్లా కాంపౌండు, ఎల్‌ఐసీ కాలనీ, షిరిడీ సాయినగర్, ఎన్‌ఎస్.పేట, కుమ్మర వీధి ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ద్విచక్రవాహనాలు, పాదచారులు వచ్చిపోయే సమయంలో కుక్కలు వెంటపడడం, కరవడంతో ప్రజలు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలను సైతం వీధి కుక్కలు కరుస్తుండంతో ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనన్న భయం పట్టణ ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకుని, వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పుంగనూరులో స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు

జయ జనార్దనా కృష్ణా రాధికాపతే

- చిత్తూరు నగరంలో వేడుకగా గోకులాష్టమి
- విశేషపూజలు, కల్యాణోత్సవం,
- ఉట్లోత్సవంతో గ్రామాల్లో సందడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శ్రీకృష్ణ ఆలయాలు, మందిరాలు హరే కృష్ణ, హరే కృష్ణ నామస్మరణతో మార్మోగాయి. గోకులాష్టమిని పురస్కరించుకుని భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి. అభిషేక పూజలు, కల్యాణోత్సవాలతో పులకరించాయి. ఉట్లోత్సవంతో పల్లె, పట్నం సందడిగా కనిపించింది.

చిత్తూరు నగరంలో సోమవారం గోకులాష్టమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గిరింపేట గాయత్రినగర్‌లోని శ్రీవేణుగోపాల కృష్ణ దేవస్థానంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు చేశారు. ఉదయం ప్రభాతభేరి, గోపూజ, అభిషేకం, 108 బిందెలతో అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాన్ని నేత్రానందంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని కల్యాణవేదికపై ఆశీనులు చేసి కల్యాణ ఘట్టాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. కల్యాణోత్సవం తర్వాత ఉత్సవం, అన్నదానం తదితర ఘటాన్ని పండితులు భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు చదివింపులు రాసుకుని స్వామి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఉట్టికొట్టే ఉత్సవం వేడుకగా సాగింది. రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత, వేణుగోపాలస్వామిని పుష్పపల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు కోదండ సభ్యులు వెంకటేష్, రాజేంద్రబాబు, మధుగోకుల్, ప్రభాకర్, గోవిందస్వామి పాల్గొన్నారు. హైరోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో పూజలు రాత్రి వరకు కొనసాగాయి. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పలువురు చిన్నారులు రాధాకృష్ణుల అలంకరణలో ఆకట్టుకున్నారు. చర్చివీధిలోని శ్రీకృష్ణ ఆలయంలోని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

వైభవంగా జన్మాష్టమి వేడుకలు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజావీధిలో ఏర్పాటు చేసి ప్రత్యేక మండపంలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. జన్మాష్టమి సందర్భంగా ప్రబోధ సేవాసమితి –ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, గీతాలాపన, భజన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రబోధానంద భక్తులు పాల్గొన్నారు.





శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో పూజలకు హాజరైన భక్తులు, స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

మొగిలిలో గోపూజ

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మవారి మూలవర్లకు అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం శివపార్వతుల గోశాలలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపూజ విశిష్టతను గురించి పాణ్యం శ్రీనివాసశర్మ భక్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి

గుడిపాల: మండలంలోని వసంతాపురం, గుడిపాల, మరకాలకుప్పం, బొమ్మసముద్రం, బసవాపల్లె, కోలావూరు, ముత్తువాళ్లూరు, చెరువు ముందరవూరు, 197 రామాపురం, పిళ్లారికుప్పం, బండపల్లె, చిత్తపారతోపాటు సోమవారం అన్ని గ్రామాల్లో అత్యంత వైభవోపేతంగా ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. ఉదయం గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో అత్యంత వైభవంగా అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. రాత్రి పలు సాంస్కతిక కార్యక్రమాలు, వీధినాటకాలను నిర్వహించారు. భక్తులు వారివారి మొక్కులను చెల్లించుకున్నారు.







బంగారుపాళెం: పూజలు అందుకున్న శ్రీకృష్ణభగవానుడు, చిత్తూరు: గాయత్రీనగర్‌లోని కృష్ణ దేవస్థానంలో కల్యాణోత్సవం జరిపిస్తున్న పండితులు, దర్శనానికి తరలివచ్చిన భక్తులు